## క్లుప్తంగా

### ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



రామవరంలో రైతులకు ప్రకృతి చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**జగ్గంపేట:** రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం ఆర్‌వీఎస్‌ఎస్‌ డీపీఎం ఎలియాజర్, మాస్టర్‌ ట్రైనర్‌ సంతోష్‌ సూచించారు. మండలంలోని రామవరంలో రైతులకు శుక్రవారం నవధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయం వలన కలిగే లాభాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం



ఏలేశ్వరంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విశ్వహిందూ పరిషత్‌ ప్రతినిధులు

**ఏలేశ్వరం:** భగవాన్‌ రమణమహర్షి వర్ధంతి సందర్భంగా స్థానిక రూపులమ్మ గుడి వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శుక్రవారం విశ్వహిందూ పరిషత్, అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళాసంఘాల సభ్యులు ప్రారంభించారు. రూపులమ్మ ఆలయ ప్రాంగణంలో లలితాసహస్ర పారాయణ, హనుమాన్‌ చాలీసా, అమ్మవారికి సంకీర్తనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళ సంఘం సభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరి, రాధ, కామాక్షి, అనంతలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు నవధాన్య విత్తనాల పంపిణీ

**గోకవరం:** మండలంలోని కొత్తపల్లిలో రైతులకు శుక్రవారం నవధాన్య విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. భూసారం పెంచేందుకుగాను ఏపీసీఎన్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో 30 రకాల విత్తనాల కిట్లను రైతులకు అందజేశారు. ఈ విత్తనాలను పొలంలో వేయడం ద్వారా పోషక విలువలతో పాటు సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూసారం పెరుగుతుందన్నారు. తొలివిడతలో సుమారు 1400 ఎకరాల్లో వేసేందుకు 300 మందికి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఏపీసీఎన్‌ఎఫ్‌ సిబ్బంది వరలక్ష్మి, మంగారత్నం, శ్రీనివాస్‌లు తెలిపారు.

### రక్తదాన శిబిరం

**కోటనందూరు:** స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అంబేడ్కర్‌ జయంతి సందర్భంగా లాయర్‌ చోడిశెట్టి బాలాజీరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 52 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదానం చేసిన యువకులను మెమెంటోలతో సత్కరించారు. తుని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ స్వప్న, అభివృద్ధి కమిటీ మెంబర్‌ యల్లపు దొర, పెనుముచ్చు ప్రవీణ్, రొంగల అర్జున్, వాసం రాము తదితరులు పాల్గొన్నారు.

### గోపాలపట్నంలో చోరీ

**తొండంగి:** గోపాలపట్నంలోని ఓ ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బిర్రే బాబ్జి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని ఆరు తులాల బంగారు నగలు, రూ.50 వేలు నగదు చోరీ చేశారు. బాధితులు తొండంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని ఎస్సై ఎస్‌.రవికుమార్‌ పరిశీలించారు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో రమణ మహర్షి ఆరాధనోత్సవం

**తుని రూరల్:** ఎస్‌.అన్నవరం శివారు (జగన్నాథగిరి) రామకృష్ణా నగర్‌ సరస్వతి విద్యాసేవా సమితి ప్రాంగణంలో శుక్రవారం రమణ మహర్షి ఆరాధనోత్సవం నిర్వహించారు. రమణ మహర్షి వర్ధంతిని పురస్కరించుకుని సేవా సమితి అధ్యక్షుడు శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఆరాధనోత్సవం, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పాయకరావుపేటకు చెందిన శర్మ మాస్టారు ముఖ్య అతిథిగా పాల్గొని రమణ మహర్షి జీవిత విశేషాలు, ఆచరించాల్సిన ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. అన్నదానంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

### గ్రామాల్లో ఆర్జీపీఎస్‌ఏ సభలు

**కోటనందూరు:** మండల పరిధిలోని అల్లిపూడి, కోటనందూరు, బిళ్లనందూరు, కేఏ మల్లవరం, ఇండుగపల్లి, బొద్దవరం, భీమవరపుకోట, ఎల్లీపేట, జగన్నాథపురం, టీజే నగరం, కాకరాపల్లి గ్రామాల్లో శుక్రవారం రాజీవ్‌గాంధీ పంచాయత్‌ శశక్తికరణ్‌ అభియాన్‌(ఆర్జీపీఎస్‌ఏ) సభలు నిర్వహించారు. పంచాయతీల్లో గత ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధి పనులు, వచ్చే ఆరు నెలల్లో చేయాల్సిన పనులపై చర్చించారు. అల్లిపూడి, భీమవరపుకోట, టీజే నగరం, బొద్దవరం గ్రామాల్లో జరిగిన సభలను ఈఓపీఆర్డీ జి.అరుణ్‌ కుమార్‌ పరిశీలించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఎస్‌.అన్నవరంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా, మాల కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ అమ్మాజీ



లంపకలోవలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌



గోకవరంలో 12 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

# స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్‌

- ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు
- ఆయన సేవలను కొనియాడిన నేతలు

**భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతి వేడుకలు శుక్రవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, పలుసంఘాలు, దళితసంఘాల నాయకులు అంబేడ్కర్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్‌ చేసిన సేవలను కొనియాడారు.**



తుని వీరవరపుపేటలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాజా, దళిత సంఘాల నాయకులు

**తుని/తుని రూరల్:** రాజ్యాంగ రచనతో స్వాతంత్ర్య భారతదేశాన్ని ఒకేతాటిపై నడిపించిన ఘనత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌కే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. తుని పట్టణం, మండల పరిధిలోని ఎస్‌.అన్నవరంలో శుక్రవారం జరిగిన అంబేడ్కర్‌ జయంతి వేడుకల్లో మంత్రి దాడిశెట్టి రాజా, మాల కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ పెదపాటి అమ్మాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అంబేడ్కర్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుని మండల పరిషత్‌ కార్యాలయంలో అంబేడ్కర్‌ చిత్రపటానికి ఎంపీపీ డాక్టర్‌ బొప్పన రాము, వైస్‌ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ పోతల రమణ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. తుని మున్సిపల్‌ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ ఏలూరి సుధారాణి ఆధ్వర్యంలో అంబెడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో మోటారు సైకిల్‌ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో గాంధీసత్రం చైర్మన్‌ అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాముర్తి మహేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్‌ చైర్మన్‌ షేక్‌ ఖ్వాజా, జెడ్‌ఆర్‌యూసీ సభ్యుడు బోడపాటి శ్రీను పాల్గొన్నారు.

**గోకవరం/జగ్గంపేట:** ప్రపంచం గర్వించదగ్గ మహామేధావి, అందరికీ ఆదర్శనీయుడు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ అని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక అరవపేటలో రాష్ట్ర క్రిస్టియన్‌ మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ వరసాల కుమారి ఆధ్వర్యంలో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన 12 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎంపీపీ పాఠశాలలో రూ.3 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించిన అంబేడ్కర్‌ కళావేదికను ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత మల్లవరంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే జగ్గంపేట మండలం జె.కొత్తూరులో గ్రామ సర్పంచ్‌ నకిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.2.50 లక్షలతో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జగ్గంపేట మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ జనపరెడ్డి బాబు, మండల కన్వీనర్‌ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్‌ దాసరి రమేష్, సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, ఎస్సీసెల్‌ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్‌ పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ కోరారు. మండలంలోని లంపకలోవలో అంబేడ్కర్‌ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సొసైటీ అధ్యక్షుడు జి. సురేష్, మండల కోఆప్షన్‌ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు పాల్గొన్నారు. ప్రత్తిపాడులో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ జయంతి వేడుకలు నిర్వహించారు. ఒమ్మంగిలో అంబేడ్కర్‌ విగ్రహానికి వైఎస్సార్‌ సీపీ నేత రామిశెట్టి చినబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

**ఏలేశ్వరం:** స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్‌ చిత్రపటానికి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ అలమండ సత్యవతి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, సుంకర రాంబాబు పాల్గొన్నారు. స్థానిక పాతబస్టాండ్‌ వద్ద మహిళలతో కలిసి చైర్‌పర్సన్‌ సత్యవతి అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కిర్లంపూడి:** స్థానిక ఎస్సీపేట, ఏనుగు వీధి కాపుల రామాలయం వద్ద ఉన్న అంబేడ్కర్‌ విగ్రహాలకు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌ మహేంద్రాడ శ్రీలత, కిర్లంపూడి సొసైటీ చైర్మన్‌ చదలవాడ బాబీ పాల్గొన్నారు.

**గండేపల్లి:** స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో అంబేడ్కర్‌ చిత్రపటానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌ జయంతి సందర్భంగా గండేపల్లిలో కబడీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎస్సై వై గణేష్‌ కుమార్‌ బహుమతులు అందజేశారు. ఎస్టీ రాజాపురంలో అంబేడ్కర్‌ విగ్రహానికి సొసైటీ అధ్యక్షులు కేతిన బాబీ, సచివాలయాల మండల కన్వీనర్‌ తాళ్లూరి మధు ఆధ్వర్యంలో పూలమాలు వేసి నివాళులర్పించారు.

**అన్నవరం:** స్థానిక రావిచెట్టు సెంటర్, ఎస్సీ కాలనీల్లో అంబేడ్కర్‌ విగ్రహాలకు ప్రత్తిపాడు సీఐ కిషోర్‌ బాబు, గ్రామసర్పంచ్‌ శెట్టిబత్తుల కుమార్‌రాజా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**రౌతులపూడి:** స్థానిక మార్కెట్‌ సెంటర్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, డీసీసీబీ డైరెక్టర్‌ పులి మధు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళలర్పించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి భాస్కర బాబు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ జిగిరెడ్డి శ్రీను పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు డీసీసీబీ డైరెక్టర్‌ పులి మధు ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

**తొండంగి:** స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో అంబేడ్కర్‌ చిత్రపటానికి ఎంపీపీ అంగుళూరి అరుణ్‌ కుమార్, వైస్‌ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్‌ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఏవీ నగరంలో తుని వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్‌ కొయ్యా మురళి, బెండపూడిలో మండల యూత్‌ కన్వీనర్‌ ఆరుమిల్లి ఏసుబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**శంఖవరం:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ అని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ అన్నారు. గ్రామంలో జైభీమ్‌ యూత్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్‌ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జైభీమ్‌ యూత్‌ సభ్యులు ఎమ్మెల్యే పర్వతను శాలువాతో సత్కరించారు.

**కోటనందూరు:** స్థానిక ఎస్సీ కాలనీ, బస్టాండ్‌ సెంటర్, మార్కెట్‌ సెంటర్ల వద్ద సర్పంచ్‌ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు అంబేడ్కర్‌ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఏలేశ్వరంలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ అలమండ సత్యవతి, మహిళలు



కిర్లంపూడిలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, నాయకులు



రౌతులపూడిలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌ సీపీ నేతలు



కోటనందూరులో అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు



తొండంగిలో అంబేడ్కర్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## గ్రామాల్లో జోరుగా ‘జగనన్నే మా భవిష్యత్‌’

**ఏలేశ్వరం:** నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం జగనన్నే మా భవిష్యత్‌ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ ఆదేశాల మేరకు వైఎస్సార్‌ సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక 13 వార్డులో పార్టీ పట్టణ కన్వీనర్‌ అలమండ వీరరాఘవస్వామి ఆధ్వర్యంలోనూ, 10వ వార్డులో వైఎస్సార్‌ సీపీ నేతలు కోరాడప్రసాద్, పైల విజయ్‌ ఆధ్వర్యంలోనూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని భద్రవరంలో సర్పంచ్‌ కూనపురెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్‌ కార్యక్రమం చేపట్టారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**ప్రత్తిపాడు రూరల్:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్‌ సీపీ జేసీఎస్‌ మండల కన్వీనర్‌ రామిశెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం, ఉత్తరకంచి, శరభవం, గజ్జనపూడి, చింతలూరు, పోతులూరు, వాకపల్లి, ఇ.గోకవరం, వేములపాలెం, యూజే పురం తదితర గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్‌ కార్యక్రమం నిర్వహించారు. ఒమ్మంగిలో వైఎస్సార్‌ సీపీ జేసీఎస్‌ మండల కన్వీనర్‌ రామిశెట్టి చినబాబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు.

**కిర్లంపూడి:** రమణయ్యపేటలో సచివాలయాల మండల కన్వీనర్‌ పెనగంటి రాజేష్, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, వైస్‌ ఎంపీపీ బొడ్డేటి గణపతి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్‌ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు సీఎం జగన్‌ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు దాడి అప్పలరాజు, సింగంపల్లి సంతోషి, కసిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.



భద్రవరంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు



రమణయ్యపేటలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

## మంత్రి రాజాను కలిసిన ఎస్పీ సతీష్‌కుమార్‌

**తుని:** శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సూచించారు. తుని మండలం ఎస్‌.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి రాజాను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అందించాలని మంత్రి సూచించారు. అనంతరం తుని పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సతీష్‌కుమార్‌ సందర్శించారు. పట్టణ సీఐ ఎం. నాగదుర్గారావు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజిటింగ్‌ పోలీసింగ్, జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఎస్సై మురళీమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌.అన్నవరంలో మంత్రి దాడిశెట్టి రాజాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్‌



తుది దశలో ఉన్న కల్వర్టు నిర్మాణ పనులు

## జోరుగా కల్వర్టు నిర్మాణ పనులు

**కోటనందూరు:** మండలంలోని తాటిపాక సెంటర్‌ నుంచి ఇండుగపల్లికి వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. తాటిపాక సెంటర్‌ ప్రారంభంలో ఈ రహదారిపై నుంచి తోటగెడ్డ ప్రవహిస్తుంది. గెడ్డ ప్రవహిస్తున్న ప్రాంతంలో కల్వర్టు లేకపోవడంతో నీటి ప్రవాహానికి రోడ్డుపై నాచు ఏర్పడుతోంది. నాచుతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు సమస్యను మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. పనులు తుది దశకు చేరాయి. త్వరలో కల్వర్టును అందుబాటులోకి తీసుకురానున్నట్లు కాంట్రాక్టరు తెలిపారు.

# వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

**అన్నవరం:** రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు రమేష్‌ ఘనపాఠి, సుధీర్, చిట్టెం వాసు, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్‌ తదితరులు హోమం జరిపారు. 38 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

**అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన**

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట శ్రీను ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

## కూరగాయలు, పాలు, పెరుగు సరఫరాకు టెండర్ల ఆహ్వానం

**సామర్లకోట:** స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి కూరగాయలు, పాలు, పెరుగు మే ఒకటి నుంచి 31 వరకు సరఫరా చేయడానికి టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండరులో పాల్గొనే వారు కూరగాయలకు రూ.ఐదు వేలు, పాలు, పెరుగుకు రూ.ఐదు వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. కూరగాయలకు రూ.ఆరు లక్షలు, పాలు, పెరుగు రూ.ఐదు లక్షల వరకు విలువ ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ లోపుగా టెండర్లు వేయాలన్నారు.

# దేవస్థానం భూముల పరిశీలన

**అన్నవరం:** స్థానిక రత్నగిరి దేవస్థానానికి వివిధ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూములను ఆలయ ఈఓ ఎస్‌ఎస్‌ చంద్రశేఖర్‌ అజాద్‌ శుక్రవారం పరిశీలించారు. దేవస్థానానికి కాకినాడ రూరల్‌ మండలంలోని తిమ్మాపురంలో 40.15 ఎకరాలు, శంఖవరం మండలం గొంది గ్రామంలో 34.33 ఎకరాలు, చెందుర్తిలో హైవేను ఆనుకుని 150 ఎకరాలు , సంపర గ్రామంలో 75 సెంట్ల భూమి ఉంది. ఈ భూములను ఈఓ చంద్రశేఖర్‌ అజాద్‌ పరిశీలించారు. వీటిలో ఏయే పంటలున్నాయి, కౌలు ఎంత వస్తుంది తదితర విషయాలను అధికారులు ఈఓకు వివరించారు. మిగిలిన గ్రామాల్లోని భూములను కూడా ఆయన శని, ఆదివారాల్లో పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. ఈ నెల 18న దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయాల భూముల వివరాలపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈఓ ఈ భూములు పరిశీలించినట్టు తెలిపారు. దేవస్థానం ఏసీ రమేష్‌ బాబు, సూపరింటెండెంట్‌ బలువు సత్యశ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



గొందిలో భూములను పరిశీలిస్తున్న ఈఓ అజాద్, ఏసీ రమేష్‌ బాబు తదితరులు

## ముగిసిన శిక్షణ తరగతులు

**అన్నవరం:** రత్నగిరిపై అర్చకులు, వ్రత పురోహితులకు దేవదాయ, ధర్మాదాయ శాఖ, అర్చక ట్రైనింగ్‌ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సభలో దేవస్థానం ఏఈఓ డీవీఎస్‌ కృష్ణారావు, అర్చక ట్రైనింగ్‌ అకాడమీ చీఫ్‌ కో ఆర్డినేటర్‌ డీవీఎం చక్రవర్తి, ద్వారకాతిరుమల ఆస్థాన సిద్ధాంతి పైతపల్లి బాలసుబ్రహ్మణ్య శర్మ, దేవదాయశాఖ ఆగమ సలహాదారు చిర్రావూరి శ్రీరామశర్మ పాల్గొని అర్చకులకు పలు సూచనలు చేశారు. శిక్షణ పొందిన పురోహితులు, అర్చకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, స్పెషల్‌గ్రేడ్‌ వ్రతపురోహితుడు ముత్య సత్యనారాయణ, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన అర్చకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏఈఓ కృష్ణారావు